# సాగుభూమి కౌలుకు నమూనా చట్టం

## కార్పొరేటు సాగు దిశగా తిరోగమన చర్య

**బిజెపి** ప్రభుత్వం ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి దాని స్థానంలో ఏర్పాటుచేసిన నీతీ ఆయోగ్ ఉనికిలో ఉన్న కౌల్దారీ చట్టాల స్థానంలో చేపట్టవలసిందిగా ఒక నమూనా కౌలు చట్టాన్ని రాష్ట్రాలకు విడుదల చేసింది. దీనికి చేసిన సన్నాహంగా, వ్యవసాయాభివృద్ధికి సూచనలిమ్మంటూ 2015 మార్చిలో ఒక టాస్కుఫోర్సును నియమించింది. దాని సూచనల మేరకు "వ్యవసాయ ఉత్పాదకత పెంపుదల – రైతులకు సాగును గిట్టుబాటు చెయ్యటం" అన్న పత్రాన్ని విడుదల చేసింది. ఈ పత్రంలో వెలిబుచ్చిన అభిప్రాయాలు నీతి ఆయోగ్, భారత ప్రభుత్వాలవి కావని పేర్కొన్నారు. అయితే వెనువెంటనే పత్రంలోని కొన్ని భాగాలను యధాతథంగా పునర్లిఖించి ఒక వ్యాసంగా నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగారియా పంపకం చేయటం ఆశ్చర్యకరం కాలేదు. దీనిలో పనగారియా కౌల్దారీ రక్షణ చట్టాలను మార్చవలసిన ఆవశ్యకతను వివరించారు.

టాస్కుఫోర్సు నివేదిక అందిన తర్వాత, 2015 సెప్టెంబరులో భూమి కౌలుపై నిపుణుల కమిటీని నీతి ఆయోగ్ నియమించగా, అది 2016 మార్చిలో తన నివేదికనందజేసింది. దీనికోసం అది అనేకమంది ముఖ్యమంత్రులనూ, రాష్ట్ర ఉన్నతాధికారులనూ, ప్రభుత్వేతర సంస్థలనూ, రైతుసంఘాలనూ సంప్రదించింది. నిపుణుల కమిటీ అధ్యక్షుడు టి.హాక్ మాటల్లో "వీరందరూ ఏకగ్రీవంగా నమూనా చట్టాన్ని సమర్థించారు. ఈ చట్టాన్ని వ్యవసాయానికే పరిమితం చేయమనీ, కార్పొరేటు సాగును ఇది ప్రోత్సహించరాదనీ కోరారు". భూమి రాష్ట్రాల అధికార పరిధిలోది గనుక నమూనా చట్టాన్ని ఆమోదించి చట్టాలు చేయమని రాష్ట్రాలకు పంపింది.

### రైతాంగ పోరాటాల తిరస్కరణ

దున్నేవానికే భూమి అమలు కోరుతూ రైతాంగం సాగించిన దీర్ఘపోరాటాల కారణంగా రాష్ట్రాలు కౌల్దారి రక్షణ చట్టాలను చేశాయి. భూస్వామ్య దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా రైతాంగం పోరాటబాటను చేపట్టారు. వీనిలో తెభాగా, పున్నప్ర వాయలార్, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాలు ముఖ్యమైనవి. రైతాంగ పోరాటాల వత్తిడితో భారత పాలకవర్గాలు జమీందారీల రద్దు, భూ గరిష్ఠ పరిమితి, కౌల్దారీ రక్షణ తర్వాత భూ సంస్కరణల చట్టాలను చేశారు. రైతాంగంలో భ్రమలు కల్పించి వారిని పోరాట పథం నుండి మళ్లించే లక్ష్యంతో చేసిన ఈ చట్టాలను ఏనాడూ పాలకులు అమలుజరపలేదు. పైగా వీటినుండి తప్పించుకునేందుకు అనేక కంతలుంచి ఆచరణలో విఫలం చేశారు.

"ఈ చట్టాల అసలు ఉద్దేశ్యం (ఫ్యూడలిజం రద్దు) ఇంకెంతమాత్రం ప్రాసంగికతను కలిగిలేదు... వీటిలోని ఆంక్షలు ఎవరికి రక్షణ కల్పించాల కోరుకుని చట్టం చేశారో, ఆ కౌలుదారులకే కాకుండా, భూ యజమానులకూ, ప్రభుత్వ విధానాల రూపకల్పనకు హానికరంగా వున్నాయ"ంటూ ఇప్పుడు నీతి ఆయోగ్ వాదిస్తున్నది.

దున్నేవానికే భూమిని పంపకం చేసే భూసంస్కరణల ఆవశ్యకతను నీతి ఆయోగ్ నిరాకరించడానికి కార్య, కారణ సంబంధాన్ని గందరగోళపరిచే తల్లక్రిందుల వాదనకు నీతి ఆయోగ్ పూనుకొంది. "కౌల్దారీ రక్షణ చట్టాలను" ఇప్పుడు నీతి ఆయోగ్ "భూ యజమానుల హక్కులపై ఆంక్షలుంచిన చట్టాలు"గా పిలవటమే దీనికి నిదర్శనం. ఉద్దేశపూరితంగానే చట్టాలను అమలు జరపలేదు. కౌలుదారులకు మేలు చేకూరకుండా చట్టంలోనే అనేక లొసుగులుంచారు. ఇప్పుడు చట్టం కౌలుదారులకు రక్షణ కల్పించలేదు గనుక ఉన్న రక్షణలను కూడా తొలగించాలి అని వాదిస్తున్నారు. అసలీ కౌల్దారీ చట్టాల్లో ఉన్నదేమిటి?

### కౌలుదారీ చట్టాలు

ఈ చట్టాలన్నీ కౌల్దారులకు రక్షణ కల్పించటాన్ని లక్ష్యంగా ప్రకటించుకున్నాయి. దీనికోసం అనేక క్లాజులను చేర్చాయి. వివిధ రాష్ట్రాలలో ఇవి వేర్వేరుగా వున్నాయి. కొన్ని ముఖ్యాంశాలను చూద్దాం.

ఎక్కువ రాష్ట్రాలలో కనీస లేదా గరిష్ఠ కౌలు కాలాన్ని నిర్దేశించలేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, రాజస్థాన్, పంజాబ్, హర్యానా రాష్ట్రాలు కనీస కౌలు కాలాన్ని నిర్ణయించాయి. ఏపిలో ఇది ఆరేళ్ళు, కాగా తెలంగాణాలో ఐదేళ్ళు, రాజస్థాన్‌లో సాగు కౌలుదారుకు ఐదేళ్ళు, గెయిర్ కౌలుదారుకు ఏడాది. పంజాబ్ హర్యానాల్లో మూడేళ్ళు.

కౌలుదారుకు కౌలు భూమిపై హక్కును కల్పించే చట్టాలు, క్లాజులు ఇలా వున్నాయి :

అస్సాం : మూడేళ్ళు వరుసగా కౌలుచేసిన వారిని కౌలు నుండి తొలగించరాదు.

బీహారు : గరిష్ఠ పరిమితి మించి భూమి వున్న రైతు వద్ద కౌలురైతుకు ఆధీన హోదా యిస్తారు. ప్రభుత్వానికి ఫీజు చెల్లించి పట్టా పొందవచ్చు.

కర్ణాటక : కౌలు భూములన్నింటికి సంస్థ పరిహారం చెల్లించి, కౌలుదారుల పరంచేసే అధికారం ప్రభుత్వానికుంది.

కేరళ : కౌలుభూములను స్వాధీనపరచుకుని దానిని కౌలుదారులకు యిచ్చే అధికారం వుంది.

ఉత్తరప్రదేశ్ : పై అధికారమే వుంది.

మహారాష్ట్ర, గుజరాత్ : 1957 ఏప్రిల్ నాటికున్న కౌలుదారులందరినీ స్వంతదారులుగా గుర్తిస్తుంది. ఏడాదిలోగా ఆ భూమికి ధర చెల్లించి కొనుగోలు చేసుకునే హక్కు కౌల్దారుకుంది.

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘర్ : భూమి శిస్తు కంటే 15 రెట్లు ఐదు విడతలుగా చెల్లించి కౌలుదారు భూయజమాని కావచ్చును.

రాజస్థాన్ : చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించి కౌలుభూమిపై స్వాధీన హక్కు కౌలుదారు పొందవచ్చు.

పంజాబు, హిమాచల్‌ప్రదేశ్ : భూ యజామానికి నిర్దేశిత నష్టపరిహారం చెల్లించి కౌలుభూమిని తీసుకునే అధికారం వుంది.

ఏపి, హర్యానా, తమిళనాడు, పశ్చిమబెంగాల్ : కౌల్దారులకు యాజమాన్య హక్కు కల్పించే అధికారాలు లేవు.

అన్ని రాష్ట్రాలలోని కౌల్దారీ చట్టాలు కౌలురేటును నిర్ణయించాయి. ఆంధ్రప్రదేశ్‌లో మాగాణి భూమికి పంటలో 30 శాతం, మెట్టలో 20 శాతం కౌలుగా నిర్ణయించారు. తెలంగాణాలో భూమిని బట్టి శిస్తుకు 2 నుంచి ఐదురెట్లు లేదా పంటలో ఐదు వంతుల నుండి నాల్గవవంతు కౌలుగా చెల్లించాలి. అస్సాంలో పంటలో ఐదవవంతు లేదా శిస్తుకు 3 రెట్లు కౌలుగా వుంది. మహారాష్ట్ర, బీహార్లో మోడ్‌కు 16.80 కేజీలు లేదా 18 సేర్లు కౌలు, గుజరాత్‌లో ఎకరాకు 20 రూ॥ మించకుండా శిస్తుకు 2 నుండి 3 రెట్లు కౌలుగా చెల్లించాలి. హర్యానాలో పంటలో మూడవవంతు, హిమాచల్‌లో పంటలో నాల్గవవంతు కౌలుగా నిర్ణయించారు. కర్ణాటకలో ఐదవవంతు కౌలు అయితే అది భూమిశిస్తుకు పదిరెట్లకు మించరాదు. ఎం.పి, ఛత్తీస్‌ఘర్‌లలో రెండు నుండి నాలుగు రెట్లు లేదా పరస్పరం అంగీకరించిన కౌలు. ఒరిస్సాలో నాల్గోవంతు, పంజాబ్‌లో మూడోవంతు, తమిళనాడులో మూడవవంతు నుండి సగం పంట కౌలుగా నిర్ణయించారు. రాజస్థాన్‌లో ఆరోవంతు నుండి నాల్గోవంతు పంట లేదా శిస్తుకు ఒకటిన్నర నుండి మూడురెట్లు కౌలుగా చెల్లించాలి. పశ్చిమ బెంగాల్‌లో సగం నుంచి నాల్గవవంతు పంట, ఉత్తర ప్రదేశ్‌లో కౌలుదారు, భూయజమాని లేదా గ్రామసభల మధ్య ఒప్పందం ప్రకారం కౌలు నిర్ణయమౌతుంది.

చట్టాలలోని ఈ అంశాలు అమలుజరిగితే కౌలుదారులకు రక్షణ ఏర్పడుతుంది. ఇది పాలకవర్గాల లక్ష్యంకాదు. కనుకనే కౌలుదారు నిర్బంధ రిజిస్ట్రేషన్ లేకుండా, కౌలుదారీచట్టాల అమలుకు యంత్రాంగాన్ని రూపొందించకుండాచేసి, కౌలు ఒప్పందాన్ని కాగితంపై పెట్టుకునే అవకాశం లేకుండా చేశారు. ఫలితంగా ఈ చట్టాలు కాగితాలకే పరిమితమై అమలుకు నోచుకోలేదు. కౌల్దారులలో మెజారిటీగావున్న భూమిలేని కూలీలు, పేదరైతాంగాన్ని భూయజమానుల దయాదాక్షిణ్యాలకు వదలిపెట్టారు. వ్యవసాయేతర రంగాల్లో ఉద్యోగకల్పన నత్తనడకన సాగుతున్నందున, భూమిపై శ్రమించటంతప్ప ఈ రైతాంగానికి మరోదారి లేకుండాపోయింది. ఈ చట్టాలు చేసిన నాటినుండి కౌలు మూజువాణీగా మారింది. రైతాంగం భూమిని కోరుకోవటంతో పోటీ పెరిగి కౌలురేట్లు పెరిగిపోయాయి. నిపుణుల కమిటీ ప్రకారం కౌలురేటు 50 శాతంగా వుంది. అయితే చాలా ప్రాంతాల్లో ఇది 100 శాతానికి చేరింది. మొదటిపంట మొత్తం కౌలుగా చెల్లించగా, రెండవ పంట ఖర్చులకు సరిపోగా, మిగిలిన గడ్డితో గేదెలు మేపుకుని పాలను అమ్మి జీవనాన్ని సాగిస్తున్నారు కౌలు రైతులు. భూమిలేని కూలీలు, పేదరైతాంగం దుస్థితి ఇది. ఈ చట్టాలలో పేర్కొన్న అంశాలేవీ కౌలుదారుల రక్షణకు అక్కరకు రాకుండా ఉద్దేశ్య పూరితంగానే పాలకులు నిర్లక్ష్యం చేశారు.

**నమూనా చట్టం ప్రతిపాదన**

కాగితాలపై వున్న ఈ రక్షణలను కూడా లేకుండా తొలగించాలని నమూనా చట్టంలో నీతి ఆయోగ్ ప్రతిపాదించింది. ఈ రక్షణలను నిపుణులకమిటి భూయజమానుల హక్కులపై ఆంక్షలుగా వివరించటమే నమూనా చట్టం ఏ దిశగా వుంటుందో తెలిపింది.

నమూనా చట్టం 3వ క్లాజులోని అంశాలు ఇలా వున్నాయి.

3.ఎఫ్.కౌలు కాలపరిమితిని ప్రభుత్వం నిర్ణయించదు. కౌలుదారు–భూయజమాని పరస్పర అంగీకారంతో ఒప్పందం చేసుకోవాలి. కౌలు కాలం ఎంతయినా కౌలుదారుకు భూమిపై ఎలాంటి హక్కు కల్పించదు.

3.జి. భూమికి చెల్లించాల్సిన కౌలును కనిష్టం లేదా గరిష్ట లేదా పంటలో భాగంలను ప్రభుత్వం నిర్ణయించరాదు. వారిద్దరి అంగీకారంతో కౌలు నిర్ణయం జరగాలి.

3. హెచ్. కౌలు ఒప్పందాన్ని రిజిస్టరు చేయవచ్చు లేదా చేయకపోవచ్చు. ఒప్పందంపై కౌలుదారు, భూయజమాని, ఇద్దరు సాక్షులు సంతకం చేయగా, సర్పంచిగానీ, స్థానిక బ్యాంకు అధికారిగానీ, నోటరీ గానీ ధృవీకరించవచ్చు.

3.జె. కౌలు ఒప్పందాన్ని రికార్డు ఆఫ్ రైట్స్‌లో చేర్చరాదు. ఎందుకంటే కౌలు ఒప్పందంవల్ల కౌలుదారుకు భూమికి సంబంధించి ఎలాంటి హక్కులూ వుండవు.

నమూనా చట్టం ప్రకారం కౌలురైతులకు ఎలాంటి హక్కులుండవు. భూయజమాని చెప్పిన షరతులకు లోబడి మాత్రమే కౌలు చేసుకోగలుగుతాడు. కౌలుదారుల రక్షణకు చేసిన చట్టాలు వారికి రక్షణ కల్పించలేకపోయాయి గనుక అసలు ఈ రక్షణలు లేకుండా చేయటం దీనికి పరిష్కారంగా చూపారు. నిజానికి దీనికొక చట్టం చేయాల్సిన పనిలేదు. ఉన్న చట్టాలు రద్దయిపోయాయని ప్రకటిస్తే సరిపోతుంది.

**వక్రీకరణలు**

ఈ రైతాంగ వ్యతిరేక ప్రతిపాదనను సమర్థించు కొనేందుకు జీవన వాస్తవాన్ని వక్రీకరించేందుకు నీతి ఆయోగ్ పూనుకుంది.

ఒకటి: మూజువాణి కౌలువల్ల కౌలుదారుకు ఎలాంటి రక్షణ లేనందువల్ల భూమిని అభివృద్ధి పరచేందుకు, పెట్టుబడిని మదుపుచేసే శ్రద్ధ కౌలుదారుకు లేనందున, వ్యవసాయ ఉత్పాదకత పెరుగుదలకు ఆటంకంగా మారింది.

చాలాకాలం క్రితమే ప్రణాళికాసంఘం నిర్వహించిన అధ్యయనం చిన్నకమతాలు కలిగిన కౌల్దారులు, పేదరైతాంగం మూలంగానే పైరుపచ్చ విప్లవంలో దిగుబడులు గణనీయంగా పెరిగాయనీ, దీనిలో పెద్దకమతాలు గల భూస్వాముల పాత్ర అత్యల్పమనీ తేల్చింది. ఇటీవలి కొన్ని అధ్యయనాలు పైరుపచ్చ విప్లవంలో దిగుబడుల పెరుగుదల స్థంభించి పోవటానికి నీరు, పురుగుమందులు, రసాయనిక ఎరువులు అత్యధికంగా వాడే దాని సాంకేతికతలోని లోపమే తప్ప రైతాంగ కృషిలో లోపం కాదని తేల్చి చెప్పాయి.

రెండు : భూయజమానులపై చట్టపర ఆంక్షల రీత్యా వారు కౌలుకివ్వకుండా పడావు పెడుతున్నారు. నమూనా చట్టంచేస్తే వారు భూమి కౌలుకిచ్చినందున భూవినియోగం పెరిగి దిగుబడులు పెరుగుతాయి.

ఇది అవాస్తం. ప్రభుత్వ లెక్కల ప్రకారమే సాగుభూమి గతంకంటే విస్తరిస్తూవచ్చింది. ఇటీవల సాగుభూమి తగ్గటానికి కారణం వ్యవసాయేతర అవసరాలకు సాగుభూమిని తరలించటమేనని ప్రభుత్వ నివేదికలే తెలిపాయి. ఇక కౌలుదారీ చట్టాలకు భయపడి భూములు పడావుపెట్టారనటం, అవి అమలు కాలేదన్న తనమాటలను తానే మింగివేయటమే.

జాతీయ నమూనా సర్వేసంస్థ 59వ విడత ప్రకారం కౌలుదారులలో 30 శాతానికి భూమిలేదు. 56 శాతానికి రెండెకరాకు లోపు భూమి వుంది. భూమిని కౌలుకు అధికస్థాయిలో తీసుకుంటున్నది ఈ రైతాంగమే.

నిపుణుల కమిటీ ఇచ్చిన లెక్కల ప్రకారం మూజువాణి కౌలుక్రింద వున్న భూమి, మొత్తం సాగుభూమిలో ఆంధ్రప్రదేశ్‌లో 32, బీహార్‌లో 21శాతం, హర్యానాలో 14 శాతం, పంజాబులో 24 శాతం, ఒడిషాలో 16, తమిళనాడులో 13 శాతంగా వుండి అఖిలభారత స్థాయిలో 10శాతంగా వుంది. నిపుణులకమిటి 1970ల నాటి ఎన్ఎస్ఎస్ఓ నివేదికను తీసుకుంది. ఇటీవల ఎన్ఎస్ఎస్ఓ అధ్యయనాలు అఖిలభారత స్థాయిలో కౌలు భూమి 40 శాతం వుండగా, సారవంత సాగుభూముల్లో 80 శాతం వరకూ వుందని తెలిపింది.

మూడు : మూజువాణీ కౌలువల్ల ప్రభుత్వ విధానాలు అమలుజరపటం సాధ్యపడటంలేదు. పంటల బీమా, రుణాలు సాగుదారుకు అందించటం సాధ్యపడటంలేదు. వీటి విస్తరణ ఆగిపోయింది.

వాస్తవానికి ఈ సౌకర్యాలన్నీ యజమానులే పొందుతున్నారు. కౌలురైతులు, వడ్డీవ్యాపారుల బారినపడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సహాయం కూడా వీరికందటంలేదు. ఇది అందరికీ తెలిసిందే. కొన్ని వాస్తవాలను దాచిపెట్టేందుకు ఈ వాదన తెచ్చారు. సంస్థాగత సాగురుణాలను వ్యవసాయ ఆధార వాణిజ్యానికి తరలిస్తున్నారు. పంటలబీమాను బ్యాంకు రుణాలు తీసుకున్న వారికే కల్పించి, రుణాలకు బీమాగా అమలు జరుపుతున్నారు. ఇక ప్రకృతి వైపరీత్యాల సహాయానికి నిధులను తగ్గించి వేస్తున్నారు. కనుక నమూనా చట్టంచేసినా రైతాంగానికి, ప్రత్యేకించి కౌలురైతాంగానికి ఒరిగేదేమీలేదు. ఈ విషయంలో ప్రభుత్వ విధానాలనే సంపూర్ణంగా మార్చుకోవాలి. ఇది చేయకుండా పైపై చర్యలు ఫలితాలనివ్వవని ఆంధ్రప్రదేశ్‌లో కౌలుదారులకు గుర్తింపుకార్డులు, కేరళలో డ్వాక్రా మహిళలకు కౌలుకిప్పించే కుటుంబశ్రీ పథకాలు తెలిపాయి.

**మరి అసలు లక్ష్యమేమిటి?**

వ్యవసాయంలో దిగుబడులను పెంచటం లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న చర్యలలో ఈ నమూనా చట్టం ఒకటి.

కమతాలు చీలిపోయి నానాటికీ బక్కచిక్కిపోయి, సాగుకు లాయకీ కాకుండా పోతున్నాయనీ, దీనికి పరిష్కారం భూకమతాలను సంఘటితపరచటమేననీ నిపుణులకమిటీ పేర్కొంది. అప్పుడు కమతాల సైజు పెరిగి ప్రైవేటు పెట్టుబడి మదుపు పెరుగుతుందనీ, అందువల్ల భూమి వినియోగసామర్థ్యం పెరుగుతుందని చెప్పింది. కనుక భూకమతాల సంఘటీకరణలో భూబ్యాంకుల ఏర్పాటు కీలకమైన అంశమనీ నిర్ధారించింది.

ఇది నమూనా చట్టంలో చెప్పలేదు. నమూనా చట్టాన్నిచ్చిన నివేదికలో నిపుణులకమిటీ, టాస్క్‌ఫోర్సు నివేదికలోనూ పేర్కొన్నారు. దాని ప్రకారం: తమ భూమిలో సాగుచేయ ఇష్టపడనివారు తమ భూమిని భూబ్యాంకులో డిపాజిట్ చేసుకుంటారు. భూమి సాగుచేయాలనుకునేవారు భూబ్యాంకు నుండి కౌలుకు తీసుకుంటారు. భూబ్యాంకును ఒక స్వతంత్ర ప్రభుత్వసంస్థ నిర్వహిస్తుంది. కావలసినవారికి కౌలుకిస్తుంది. వారినుండి కౌలు తీసుకుని భూయజమానికి ఇస్తుంది. తన కార్యకలాపాలకు నామమాత్రపు ఫీజు తీసుకుని ఇరువురిమధ్య ఒక ఏజెంట్‌గా వ్యవహరిస్తుంది.

ఇది ప్రతిపాదన. దీనిని సమర్థిస్తూ చేసిన వాదనలు ఇలా వున్నాయి : 'భూ యజమాని వ్యవసాయేతరరంగంలో ఉపాధిని ఏర్పరచుకుంటాడు. భూమిలేని రైతాంగానికి చేయగలిగినంత భూమి అందుబాటులోకి వస్తుంది. ఆవిధంగా ఇరువురి ఆదాయాలు పెరుగుతాయి. ఆవిధంగా (పాత చట్టాలు సాధించలేని) సమానత్వం వస్తుంది. పెట్టుబడుల మదుపు పెరిగి వ్యవసాయాభివృద్ధి పరుగులు తీస్తుంది'.

కౌలుదారులు, పేద రైతాంగానికి మేలు చేకూర్చటం పేరిట సాగుతున్న మోసమిది. ఈ విధానం కౌలురైతులను, కౌలుదారులను, పేద రైతులను భూమినుండి తొలగిస్తుంది. రైతాంగాన్ని నష్టపరిచే లక్ష్యంతో అమలవుతున్న ప్రభుత్వ విధానాలతో విసిగివేసారిన మధ్యతరగతి, ధనిక రైతాంగానికి సరసమైన కౌలు ఎరగావేసి భూబ్యాంకులో చేరుస్తారు. అలా చేర్చిన భూమిని దేశ విదేశీ బడా వ్యవసాయ వాణిజ్య కంపెనీలకు అందజేస్తారు. ఆవిధంగా కార్పొరేటు సాగుకు దారి సుగమం చేసేందుకే నమూనా చట్టాన్ని ముందుకు తెచ్చారు.

దీనిని వ్యవసాయ దిగుబడుల పెంపుదలకు టాస్కుఫోర్సు చేసిన మిగిలిన సూచనలతో కలిపి చూసినప్పుడు అసలు విషయం స్పష్టంగా కన్పిస్తుంది.

ప్రతి బొట్టు నీటికి ఎక్కువ దిగుబడి; జన్యు మార్పిడి విత్తనాల వినియోగం పెంపు; అధికవిలువ గల సరుకుల తయారీకి సాగును మార్చటం; దీనికి నూతన సాంకేతికతను వాడటం; కనీస మద్దతుధర, చౌకధరల దుకాణాలరద్దు, వ్యవసాయ మార్కెట్లను బడాపెట్టుబడిపరంచేయటం; బడా రిటైల్ వ్యాపారంతో ముందుగానే ఒప్పందాలు–టాస్కుఫోర్సు సూచనలు. ఇవి అమలుచేయాలంటే 82 శాతంగావున్న పేద రైతాంగానికి సాధ్యపడదు. కనీసం 50 నుండి 100 ఎకరాల కమతం వుంటేనే ఈ సాగు సాధ్యపడి గిట్టుబాటు అవుతుంది. అది కూడా వ్యవసాయ మార్కెట్టుపై ఆధిపత్యంపొందిన బడాబూర్జువాలు దయతలిస్తేనే.

రైతాంగాన్ని భూమినుండి తొలగించివేస్తున్న విధానాలలో భాగమే, కౌలుదారీ చట్టాల తిరస్కరణకు రూపొందించిన నమూనా చట్టం. భూమిని బడా బూర్జువాల పరంచేయటమే లక్ష్యంగా ఈ చర్యలు సాగుతున్నాయి. వాస్తవానికి బడాబూర్జువాలంటే సామ్రాజ్యవాద ప్రత్యక్ష, పరోక్ష పెట్టుబడి. ఇది దేశ, ప్రజల ప్రయోజనాలకు హానికరంగా వ్యవసాయ రంగాన్ని మలుస్తుంది. భారత్ పరాధీనతను ఆహార రంగానికి కూడా విస్తరిస్తుంది.

ఈ తిరోగమన చర్యను ప్రజాతంత్రవాదులు, ప్రజలు ఖండించాలి. భూమికొరకు జీవనోపాధి కొరకు పోరాడుతున్న రైతాంగానికి అండదండ లందించాలి.

ooooooo